విశాలాంధ్ర కృష్ణా జిల్లా

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-కృత్తివెన్ను : పాల ఉత్పత్తిదారుల అభివృద్ధికి సంగం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. చైర్మన్ బుధవారం చెరుకుమిల్లి, ఎండపల్లి, గాంధీనగర్ సంఘాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ సభ్యులను సత్కరించారు. పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోనస్ 15% ఇస్తున్నట్లు తెలిపారు. సంఘం సభ్యుల ఆర్థిక అవసరాలు తీర్చేందుకు సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. సభ్యుల పాల ఉత్పత్తులు పెంపొందించేందుకు సంఘం ద్వారా వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. సంఘంలో అమలవుతున్న పథకాలను ఉపయోగించుకుని సంఘం సభ్యులు పాల ఉత్పత్తిని పెంపొందించాలని కోరారు.క్షీర బందు, కళ్యాణమస్తు పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. పశువులకు ఉచిత వైద్య శిబిరం, ఉచిత జలగం మందులు పంపిణీ చేయడమే కాకుండా మేలు జాతి కృత్రిమ గర్భాధారణ 50 రూపాయలకే చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ గవిని అనిల్ కుమార్, అర్జా వెంకట నాగేశ్వర రావు, ముత్యాల వెంకట శివ ఉమ్మిడిముక్కల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

విశాలాంధ్ర-గన్నవరం : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గన్నవరం సి ఐ వి ఎస్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. బుధవారం యాంటీ డ్రగ్స్ పై వికెఆర్ కళాశాల హైస్కూల్ విద్యార్థులతో యాంటీ డ్రగ్స్ పై అవగాహన ర్యాలీని పోలీస్ స్టేషన్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ బస్టాండ్ వెంకటేశ్వర థియేటర్ గాంధీ బొమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ మాట్లాడుతూ యువత దేశానికి పట్టుకొమ్మ లని వారుమంచి ఆలోచనలు ఉండాలని సమాజానికి దేశ అభివృద్ధికి తోర్పడలని సూచించారు. మీ చుట్టుప్రక్కలడ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం వచ్చిన విక్రయిస్తున్నట్లు తెలిసిన దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వవలసినది గా కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కారాదు మీ జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. సరదాగా అలవాటు చేసుకొని మలలేని విధంగా మరి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు విద్యార్థులు పాల్గొన్నారు.

1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో జూలై 1వ తేదీన జూన్ నెల పెన్షన్లు 8751 మందికి పంపిణీ చేయడానికి ఐదు కోట్ల 75 లక్షల 52 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్ తో పాటు ఏప్రిల్, మే, జూన్, నెల బకాయిలు నెలకి రూ.1000 చొప్పున 3 వేల రూపాయలను కలిపి ఏడు వేల రూపాయలు లబ్ధిదారులకు అందించడానికి నిధులు మంజూరు చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి జీవో ఎంఎస్ 43 ద్వారా వృద్ధాప్య వితంతు తదితర 10 రకాల పెన్షన్లు బకాయి తో కలిపి 7000, దివ్యాంగ పెన్షన్ 6000, డి ఎం హెచ్ ఓ పెన్షన్ 10000 పక్షవాతంతో మంచం మీద వీల్ చైర్కే పరిమితమైన వారికి 15 వేల రూపాయలు చొప్పున పెంచిన ఫంక్షను సొమ్ము ఈనెల 29వ తారీఖున బ్యాంకు నుంచి డ్రా చేసుకొని జూలై 1వ తారీఖున సచివాలయ సిబ్బంది మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా సచివాలయాల వారీగా మంజూరైన పెన్షన్ వివరాలు ఇవే... ఊరు పూడి సచివాలయానికి 406, అయ్యంకిలో 508, భట్ల పెనుమర్రుకు546, చినముత్తేవికి364, కాజ-1 కు 685, కాజ-2 కు 585, కోసూరుకు931, కూచిపూడి కి 601, మంత్రి పాలెం కు 368, మొవ్వ-1 కు 483, మొవ్వ-2 కు 393, నిడుమోలులో 579, పెదముత్తేవిలో 610, పెదపూడి లో 708, పెదసనగల్లులో 517, వేములమడ సచివాలయంలో 469 ఎన్టీఆర్ భరోసాపెన్షన్లుకు ప్రభుత్వంప్రకటించినట్టుగా బకాయిలతోసహా నిధులు మంజూరు అయినాయి.

కూచిపూడి స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా నాగకుమార్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంకూచిపూడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ గా ధూళిపాళ నాగ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మచిలీపట్నం బ్రాంచ్ నుంచి బదిలీపై విచ్చేశారు. ఇప్పటివరకు కూచిపూడి ఎస్.బి.ఐ. మేనేజర్ గా పనిచేసిన ఏ.పాలలోచనాచారి మచిలీపట్నం బ్రాంచ్ కి బదిలీ అయినారు. బ్రాంచ్ మేనేజర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగ కుమార్ ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందించారు.

గనియాడకు మాతృవియోగం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా ఈసీ మెంబర్ సీనియర్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు గనియాడ సత్యనారాయణ తల్లి మంగళవారం అకాల మరణంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి స్వగ్రామమైన కృత్తివెన్నులో బుధవారం గడియాడ చంద్రమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉమ్మడి కృష్ణాజిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చందమామబాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ యూనియన్ ఉపాధ్యక్షులు నందిగామ శివ శంకర వరప్రసాద్, యూనియన్ సభ్యులు మాగంటి కనక చింతయ్య, పెదన నియోజకవర్గ పాత్రికేయులు లాజర్, కృత్తివెన్ను మండలం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పులగం కేశవులు, రామకృష్ణ, అంజిబాబు, ఈశ్వరరావు, పట్టపు రమేష్ తదితరులు సంతాపం తెలిపారు.

అభివృద్ధి దిశగా మచిలీపట్నం

విశాలాంధ్రబ్యూరో, మచిలీపట్నం : మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం ద్వారా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త వెంచర్లు రావడం శుభపరిణామం అని రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య అన్నారు. బుధవారం మచిలీపట్నం- పెడనరోడ్ లోగలమాచవరంవద్ద దండమూడిహోమ్స్వెంచర్ ప్రారంభోత్సవ వేడుకలకు వచ్చిన ఆయన మాట్లాడుతూ మంచి డెవలప్‌మెంట్‌తో మచిలీపట్నం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎండి అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ దండమూడి హోమ్స్ హైదరాబాద్ చుట్టుపక్కల 18 వెంచర్స్ వేసి విజయవంతంగా పూర్తి చేయడమే కాక, కృష్ణాజిల్లాలోకూడాఅభివృద్ధి చేయాలనేఉద్దేశంతో19వ వెంచర్ను ప్రారంభించామని,వెంచర్ ఆధునికరంలోభాగంగావిశాలమైన బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం, వుడా అప్రూవల్ తో 7 ఎకరంల విస్తీర్ణంలో, 160 స్క్వేర్ యార్డ్స్, 180 స్క్వేర్ యార్డ్స్ ప్లాట్లుగావేసిఅభివృద్ధి చేస్తున్నామనివివరించారు.

సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్రబ్యూరో,మచిలీపట్నం : ఈ నెల 27వ తేదీన పెనమలూరు మండలం తాడిగడప- ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు అను మోలు గార్డెన్స్ లో రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు సంస్మరణ సభ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై శ్రీచైతన్య మహిళా జూనియర్ కళాశాల మీటింగ్ హాల్లో బుధవారం ఏఎస్ఎల్ (అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్) సమావేశం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు సంస్మరణ సభకు ముఖ్యమంత్రి ఈనెల 27వ తేదీ సాయంత్రం 4.30 చేరుకుని, సా.6:30 గంటలకు ఉండి అనంతరం విజయవాడలోని నోవాటెల్‌కు హోటల్‌కు వెళతారని తెలిపారు. రామోజీరావు కుటుంబసభ్యులు, సమీపబంధువులు, మంత్రులు, వివిఐపిలు (వేదికపైన) ఏ-1గ్యాలరీ, వీరికి వేదిక పక్కనే సిద్ధార్థలో ఏ-1 పార్కింగ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ఎం-1 గ్యాలరీ, వీరికి చైతన్య మహిళ జూనియర్ కళాశాల ఆవరణలోఎం1పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంటర్‌టైన్‌మెంట్, ఈనాడు గ్రూపు సంస్థల ప్రతినిధులు, జాతీయ మీడియాకు బి 1 గ్యాలరీ, వీరికి కృష్ణవేణి విద్యాసంస్థల ఆవరణ బి1 పార్కింగ్, అధికారుల వాహనాలు, జనరల్ పబ్లిక్ (బస్సులు, ఇతరుల వాహనాలు) విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బెంజ్ సర్కిల్ వద్ద వాహన పాసులేని వాటికి వీఆర్ సిద్ధార్థలో పార్కింగ్ చేయాలని బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో సైనేజీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సా.4 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. ప్రధాన వేదిక వద్ద, పార్కింగ్ ప్రదేశాల్లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు.సభ ఏర్పాట్లు అన్ని ఈరోజు సాయంత్రానికి పూర్తిచేయాలని ఆదేశించారు. సీఎం భద్రతా అధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రధాన వేదికకు చేరుకునే రూట్ కృష్ణాజిల్లా, ఎన్టీఆర్ జిల్లా విజయవాడసిటీ లిమిట్స్‌లో ఉందని, ఈరూట్ పరిశీలించామని, కార్యక్రమం రోజున వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ నివారణచర్యలు తీసుకోవడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తుఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశానికి ముందు ఏపీసిఆర్డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్,కృష్ణా ఎస్పీఅద్నాన్ నయీమ్ అస్మి, సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాషా, జి ఏ డి.ప్రోటోకాల్,వివిధ శాఖల అధికారులతో కలసి సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి ఎస్ వి డి ప్రసాద్, గన్నవరం డీఎస్పి జయసూర్య,సమాచారశాఖ జాయింట్ డైరెక్టర్ టీ.కస్తూరి, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఉయ్యూరు, గుడివాడ రెవిన్యూ డివిజన్ల అధికారులు డి రాజు,పి పద్మావతి, గుడివాడ, వైయస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్లు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన
తాగునీటిని అందించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే తన ముందు ఉన్న లక్ష్యం అని, ఆ విధంగానే కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో గ్రామ పంచాయితీ తాగునీటి చెరువును మండలి బుద్ధప్రసాద్ ఆయన తనయుడు మండలి వెంకట్రామ్ ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకొని చెరువు సమస్యను పరిశీలించి చెరువు నీటిని బాటిల్‌లో నింపి పరిశీలించారు. చెరువు సమగ్ర అభివృద్ధికి అంచనాలు రూపొందించాలని అధికారులకు మండలి సూచించారు. నియోజకవర్గంలోని తాగునీటి చెరువుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయితీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి పవన్ సహకారంతో నిధులు మంజూరు చేయిస్తామని మండలి అన్నారు. డయేరియా వంటి వ్యాధ్యుల భారీన గ్రామాల ప్రజలు పడకుండా సురక్షితమైన తాగు నీటిని అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈయన వెంట పలువురు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-గుడివాడ : యువత తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని రూరల్ సిఐ ఏసుబాబు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు సిఐలు కె.రామోహనరావు, కరుణ ప్రియాలు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గుడివాడ సబ్ డివిజన్ పోలీస్ శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్ సెంటర్ నెహ్రూచౌక్ మీదుగా గుడివాడ ప్రధాన రహదారి నుండి తిరిగి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్.పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి క్షణికావేశంలో యువత నేరాలకు పాల్పడడం జరుగుతోందన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 1టౌన్, 2టౌన్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 500 డీఎస్సీ పోస్టులివ్వాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తాజాగా ప్రకటించిన మోగా డీఎస్సీలో తమ జిల్లాలకు కూడా కనీసం 500 ఉపాధ్యాయ ఉద్యోగాల చొప్పున కృషి చేయాలని అనంతరపురం, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులు కోరారు. ఈ నాలుగు జిల్లాల్లో జిల్లాకు కనీసం 500 పోస్టులు ఇవ్వాలని అవనిగడ్డలో మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనాయకుడు మండలి వెంకట్రామ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకు అత్యధికంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ప్రకటించారని, శ్రీకాకుళం జిల్లాలకు 144, అనంతరపురం జిల్లాకు 183, నెల్లూరు జిల్లాకు 104, ప్రకాశం జిల్లాకు 124 ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నట్లు తెలియవచ్చిందన్నారు. తమ జిల్లాల్లో కూడా డి.ఎస్.సి అభ్యర్థులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల సానుకూల నిర్ణయాలు తీసుకునేలా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లాలని డీఎస్సీ అభ్యర్థులు వెంకట్రామ్‌కు విజ్ఞప్తి చేశారు. వైసిపి ప్రభుత్వంలో మోగా డిఎస్సి పేరుతో తమకు మోసం జరిగిన సమయంలో తమకు అండగా నిలిచిన మండలి బుద్ధప్రసాద్ మండలి వెంకట్రామ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిఎస్సి అభ్యర్థులకు మీరు అందించిన సహకారం మరువలేనిదని అందుకు అనుగుణంగా టిడిపి, బిజెపి, జనసేన ప్రభుత్వం మోగా డిఎస్సి ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీఎస్పీ అభ్యర్థుల ఆశలు నెరవేర్చిందన్నారు. తాజా మోగా డిఎస్సిలో తమ జిల్లాలకు కూడా కనీసం 500 పోస్టల చొప్పున మంజూరు చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొవ్వ విద్యార్థినికి విట్‌లో సీటు

విశాలాంధ్ర-కూచిపూడి : క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థిని కాపుదాసిశ్రీవిద్య(పెనుముత్స)కు అమరావతి లోని విట్(వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) విశ్వ విద్యాలయంలో ఉచిత సీట్ లభించింది. ఈ విషయాన్ని కళాశాల ప్రధానాచార్యులు కే ఏవిఎస్‌వి ప్రసాదశాస్త్రి బుధవారం విలేకరులకు తెలిపారు. కృష్ణా జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతంలో ప్రథమ స్థానం సాధించిన క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లో శ్రీవిద్య కూడా 1000 మార్కులకు 963 మార్కులు సాధించి మొదటి స్థానాన్ని పొందింది. ఈ దశలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విట్ విశ్వ విద్యాలయంలో స్థానం లభించడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాలఅధ్యాపక బృందం ఆ విద్యార్థిని అభినందించింది.

మూడు సెక్టార్లలో గ్రాడ్యుయేషన్ డే...

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని మొవ్వ, కూచిపూడి, నిడుమోలు సెక్టార్లలో ఆయా సూపర్వైజర్స్ బుధవారం పండగ వాతావరణం లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. మొవ్వ సెక్టార్.పరిధిలోని కాజ లోని ఎనిమిది కేంద్రాలలో అర్హులైన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలునిర్వహించి సర్పంచ్ కొడాలి భవాని చేతుల మీదుగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సెక్టార్ సూపర్వైజర్ ఏనుగు పుణ్యవతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం జి సుశీల రాణి, కార్యకర్తలు ఏ విజయశ్రీ, సిహెచ్ అనితాకుమారి,టి రజిత, డి రాజారత్నం, వై లక్ష్మి, బి రజిత రాణి, ఎల్.వాణి శ్రీలత, ఎన్ విజయ కుమారి పాల్గొన్నారు. నిడుమోలు సెక్టార్ పరిధిలోని పెదసనగల్లు పంచాయతీ పరిధిలో గల నాలుగు అంగనవాడి కేంద్రాలలోని అర్హులైన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్, సచివాలయ మహిళా పోలీస్ జే .సునీతే అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఏ జ్యోతి, సూపర్వైజర్ అబ్దుల్ సలీమున్నీసా, కార్యకర్తలు ఎం అరుణ్ కుమారి, డి కృష్ణకుమారి, జే చెన్నమ్మ, కేఎల్ మనోహరం, ఆశా వర్కర్స్ జి రోజా, వి పూర్ణిమ, లతోపాటు తల్లులు పాల్గొన్నారు. కూచిపూడి సెక్టార్ పరిధిలోని పద్దరాయుడు తోటలో సర్పంచ్ తాతా స్వప్న ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సెక్టార్ సూపర్వైజర్ ఏఎస్ కళ్యాణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ తాతా వేదవతి, కొక్కిలిగడ్డ మాణిక్యం, కటకం బాలాజీ కుమారి లతోపాటు తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికడదాం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- యువత మాదకద్రవ్యాలను విడనాడి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహనరావు పిలుపునిచ్చారు .ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించి బుధవారం బంటుమిల్లి పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహనరావు మాట్లడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .చదువుకునే విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి పోలీసుకేసులలో ఇరుక్కుంటే వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా మిగిలిపోతారన్నారు .తల్లిదండ్రులు తమపిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని ఎన్నో ఆశలతో జీవిస్తున్నారన్న విషయన్ని ప్రతిఒక్క విద్యార్థి గుర్తుపెట్టుకొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్యను ఇష్టంతో అభ్యశించి కుటుంబాలకు ఆసరాగా నిలబడాలని వివరించారు .అనంతరం బంటుమిల్లి పురవీధులలో అధ్యాపకులు ,విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తూ మాధకద్రవ్యాల నివరణపై ,వాటివల్ల వచ్చు అనర్థాలపై ప్రజలకు వివరించారు . ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు ,ఐ క్యూ ఏ సి కో ఆర్డినేటర్ కె హేమాలినీదేవి ,జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అదికారి డాక్టర్ జి బి ఆనందకుమార్ ,సత్యరాజ్ ,జుబేదా బేగం ,జ్యోష్న ,సుజాత ,ప్రమోద్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రతి ఒక్కరూ మాదవద్రవ్యాలను నియంత్రించాలని గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసు అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో యువత మరియు పాఠకులచే మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదకద్రవ్యాల నియంత్రణ భారతదేశం కోసం తన వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం అవుతాయని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఇ శ్రీదేవి, గ్రంథాలయ సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు ప్రగతి పథంలో నడవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యార్థులు మాదకద్రవ్యాల మత్తులో కాక, ఆశయ సాధన మత్తులో ప్రగతి పథంలో నడవాలని సేవా పథకం ప్రోగ్రామ్ అధికారిణి వీర కుమారిణి అన్నారు. ప్రభుత్వ డిగ్రి కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేకత దినోత్సవ సందర్భంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎక్సైజ్ బ్యూరో సిఐ వివి సత్యనారాయణ, ఎస్ఐ సిబ్బంది పాల్గొని మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలను, ఎదుర్కోబోయే శిక్షలను, ఎదురయ్యే అనారోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. ఎన్.ఎస్.ఎస్ విభాగాధిపతి వీరకుమారిని ప్రిన్సిపాల్ కళాశాల సిబ్బంది అభినందించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్యంతో కూడిన విద్య

విశాలాంధ్ర-ఘంటసాల : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్యంతో కూడిన విద్యనందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.మేరీ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు అంగన్వాడీ కేంద్రంలో శ్రీకాకుళం సెక్టార్ పరిధిలోని చిట్టూర్పు, వేములపల్లి పంచాయతీల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మేరీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాల చిన్నారులకు పౌష్టికారంతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన తెలుగు. ఆంగ్ల విద్య నేర్పిస్తారని తెలిపారు. అనంతరం ప్రీ స్కూల్ పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్టూర్పు సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం బి. వెంకటేశ్వరమ్మ. ఎఎన్ఎంలు, చిన్నారులు పాల్గొన్నారు.

లంకపల్లిలో నగల కోసం వృద్ధురాలి హత్య!

విశాలాంధ్ర-పమిడిముక్కల: లంకపల్లిలో సూరపనేని జ్యోతి కృష్ణ (60) వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి బంగారం, నగదు దొంగిలించినట్లు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం రాత్రి జ్యోతి కృష్ణ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె తలపై బలంగా కొట్టటంతో తీవ్రంగా గాయపడిందని, ప్రతి రోజూ ఫోన్ చేసే విధంగా బుధవారం ఉదయం ఆమె కుమార్తె హైదరాబాద్ నుంచి ఫోన్‌చేస్తే ఫోన్ తీయక పోవడంతో పక్కనున్న బంధువులకి ఫోన్‌చేసి చూడమనిగా వారు వెళ్ళి చూడగా తీవ్ర గాయాల యాలతో కింద పడివుండటం చూసి పోలీసులకి తెలుపగా వారు వచ్చి పరిశీలించి విజయవాడ ప్రైవేటు వైద్యశాలకు తరలించిగా వారు ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేయగా అక్కడకు చేరేసరికి మరణించిందని తెలపగా శవపరీక్షకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతిరాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారని వారు వచ్చి పరిశీలించగా 98 గ్రాములు బంగారం, రూ.40 వేల నగదు పోయినట్లు తెలిపారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై గుడివాడ డిఎస్పీ శ్రీకాంత్, సి.ఐ. కె.ఏసుదాసు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ హత్య మండలంలో కలకలం రేపుతోంది.

అంగన్వాడీ కేంద్రాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన వయస్సు కి విద్యార్జన అందించాలని దానికి అంగన్వాడీ కేంద్రాలు సరైనవని అంగన్వాడీ సూపర్వైజర్ బి.ఉషా అన్నారు.బుధవారం మేడూరు-3 అంగన్వాడీ కేంద్రం లో గ్రాడ్యుయేషన్ డే, అంగన్వాడీ పిలుస్తోంది రా.., డయోరయా పై కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను మూడు సంవత్సరాలకు అంగన్వాడీ కి పంపంటం వలన పిల్లల మేధాశక్తి అభివృద్ధి చెందుతుందని ,పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందచేస్తున్నామని ,ఆటలు పాటలు తో మానసిక ఉల్లాసం తో ఉంటారని తెలిపారు.కాగ ప్రతి కేంద్ర లోను డయోరియా ప్రభల కుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు వేడి ఆహారం పెట్టాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి. స్వర్ణలత, ఎ.ఎన్.యం.లు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.కాగ లంకపల్లిలో సూపర్వైజర్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గుమ్మళ్ల సృజన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రతిష్టాత్మక ఎన్‌టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉందని.. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని.. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా నూతన కలెక్టర్ డా. గుమ్మళ్ల సృజన అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో డాక్టర్ గుమ్మళ్ల సృజన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న అనంతరం కలెక్టర్‌కు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ 2015-16లో విజయవాడలో సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించానని.. మళ్లీ ఇక్కడే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో చాలా ఆనందంగా ఉందన్నారు. నిర్దేశించిన ప్రణాళికల మేరకు అందరి సహాయసహకారాలతో రాష్ట్రం, జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ లక్ష్యాల సాధనకు కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల ముప్పు ఉంటుందని.. డయేరియాతో పాటు మలేరియా, డెంగీ వంటి వ్యాధులు కూడా ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉంటామని.. క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, శుభ్రమైన నీటిని ప్రజలకు అందిస్తామన్నారు. ఒకవేళ ఎవరైనా వ్యాధుల బారినపడితే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. సమీకృత ప్రణాళిక ప్రకారం ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు కృషిచేయనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. కలెక్టరేట్ సెక్షన్లను పరిశీలించిన కలెక్టర్:లి కొత్తగా బాధ్యతలు తీసుకున్న అనంతరం కలెక్టర్ సృజన.. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్, ల్యాండ్, కోఆర్డినేషన్, మెజిస్టీరియల్, లీగల్ సెల్, ఎన్నికల విభాగం తదితర సెక్షన్ల కార్యకలాపాలను పరిశీలించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు.. జిల్లాస్థాయి అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్వో కె.రవి, ఏవీ సూపర్వైజర్ వీవీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీసీవో ఎస్.శ్రీనివాసరెడ్డి, యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. జె.సుమన్, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామరావుతో పాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణి

విశాలాంధ్ర-కంచికచర్ల : నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా స్థానిక అరుంధతి కాలనీలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు బుధవారం శేషం కనక రత్నం చేతుల మీదగా పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్య మైన విద్యను అందించడం జరుగు తోందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాల న్నారు. విద్యా కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుంద న్నారు. కంచికచర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందు కు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు,నగిరికంటి ఏసోబు, జల్లి ఏసోబు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా సీపీ పిహెచ్‌డీ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో డీజీపీ ద్వారక తిరుమలరావు ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల న్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిని అరికట్టడానికి ఎల్లవేళ సిద్ధంగా ఉన్నామని, డ్రగ్స్ మాఫియాను అరికట్టడానికి ప్రజలు, విద్యార్థులు పోలీసులకు సహకరించాలన్నారు. 35ఏళ్ల క్రితం ఫ్యాషన్ కోసం కొంత మంది డ్రగ్స్ మొదలు పెట్టారని, ప్రస్తుతం స్కూల్ విద్యార్థులు కూడా ఈ వ్యసనాలకు బానిసలవు తున్నారని, సామాన్యులే కాకుండా, స్పోర్ట్స్, సెలబ్రిటీలు డ్రగ్స్ తీసుకుంటే వారి జీవితాలు నాశనం అవుతుందని అన్నారు. డ్రగ్స్ కేసుల్లో సంవత్సరాల పాటు శిక్షలు ఉంటాయని తెలిపారు. దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని అన్నారు. డ్రగ్స్ మాఫియా కొన్ని దేశాలు శాశిస్తున్నాయని, డ్రగ్స్ పరిమితి పెరిగితే అంతర్జాతీయంగా ఆ దేశం పై నిషేధం విధించే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు చెప్పిన మార్గంలోనే వారి భవిష్యత్‌కు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాలు కాలేజీ నుంచి స్కూల్ విద్యార్థులకు చేరుకుందని, ఇది సమాజానికి చాలా ప్రమాదామని చెప్పారు. మత్తుపదార్థాల వల్ల ఆరోగ్య, భవిష్యత్‌లో కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డెరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వర రావు, డీసీపీలు కే.శ్రీనివాసరావు, అధిరాజ్ రాణా, ఏబీటీఎస్ ఉదయరాణి, హరికృష్ణ, కే.చక్రవర్తి, ఏడీసీపీలు కృష్ణమూర్తి నాయుడు, టీ.కనకరాజు, ఏసీపీలు, సీఐలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇటీవల ఫిబ్రవరి నెలలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సెకండ్ లెవెల్ ఒలంపియాడ్ (ఎస్.ఓ.ఎఫ్) పరీక్షలలో తమదైన ప్రతిభను కనబరచిన వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు 9 వ తరగతికి చెందిన జి. శ్రీ నిధి - అంతర్జాతీయ ఆంగ్ల విభాగములో (ఎస్.ఓ.ఎఫ్) బంగారు పతకం మరియు రూ.5000నగదు బహుమతి, ధ్రువపత్రం పొందింది. వై. ఇషిత జాతీయ సైన్సు విభాగంలో (ఎస్.ఓ.ఎఫ్) జోనల్ బహుమతి రూ.500 నగదు బహుమతి, ధ్రువపత్రము పొందారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య,వైస్ ప్రిన్సిపాల్ కుప్ప రోజ్ మేరీ లు అభినందిచారు.

సమన్వయంతో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సమన్వయం, సమష్టి కృషితో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వివిధ శాఖల అధికారులు.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కృషిచేయాలని, మత్తు పదార్థాల దుర్వినియోగం, దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా యువ జన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సృజన.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని... బంగారు భవిష్యత్తు దిశగా అడుగులేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఇప్పటికే మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అత్యుత్తమ పనితీరుతో జిల్లా ముందుందని.. ఇదే స్ఫూర్తితో ముున్ముందు కూడా వినూత్న అవగాహన కార్యక్రమాలతో పాటు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జిల్లా యువజన సర్వీసుల అధికారి యు.శ్రీనివాస రావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నలంద కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని నలంద కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలతో జీవితం ఎలా ఛిద్రమవుతుందో వివరించారు. నేను, నా సమాజాన్ని మాదకద్రవ్యాల నుంచి రక్షించేందుకు మాదక ద్రవ్యాల నివారణపై దృష్టిపెడతానంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల అధికారి యు.శ్రీనివాసరావు, మాచవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, నలంద కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, సూపరింటెండెంట్ పీవీ రాఘవ శర్మ, పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ: సింగ్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలలో కొద్ది రోజులుగా నుండి ఉదయం పూట కలుషితమైన నీరు, మురికి నీరు సరఫరా అవుతున్నాయని దీనిని నివారించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు స్థానిక నాయకులతో కలిసి సింగ్‌నగర్ తాగునీటి సరఫరా ఏఈ అరుణ్ దేవ్ కుమార్‌ని బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని డయేరియా విజృంభించే ప్రమాదం ఉన్నదన్నారు. అలాగే 30 నిమిషాలు పాటు అందించే నీరు సరిపోవడం లేదని, మరో 15 నిమిషాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏఈ కలుషిత నీటి సరపరా ఎందుకు జరుగుతుందో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు లింగా బత్తుల శివకుమార్ ,కంది ఆదినారాయణ ,సీహెచ్ గురవయ్య, పీ నాగరాజు పాల్గొన్నారు.

డయేరియా అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలోని జివిజే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) నందు వైద్య విద్య అధికారులు ఏర్పాటు చేసిన డయేరియా అవగాహన కార్యక్రమం ర్యాలీలో ముఖ్యఅతిథిగా టిడిపి జాతీయ కోశాధికారి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా విషయంలో ప్రజలు తగు జాగ్రత్త లు తీసుకోవాలని, ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని, ఆహారం తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రంగా చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న పాడైపోయిన ఆహార పదార్థాలు తినరాదు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీళ్ల నిలువ లేకుండా చూసుకుంటూ ఇంటి పరిసరాలను బ్లీచింగ్, ఫినాయిల్ మొదలగు వాటిని వినియోగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. బయట తినుబండారాలను వాడుకుండా ఇంటిలో వండిన ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం వాటర్ ట్యాంకు చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్య అధికారులు మరియు ఎన్ డి ఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలి : డీసీపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ కమిషనరేట్ వెస్ట్‌జోన్ డీసీపీ టీ హరికృష్ణ అన్నారు. విజయవాడ పోలీస్ వెస్ట్ డివిజన్, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గా హజరైన డీసీపీ హరికృష్ణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పద్దార్థాలకు అలవాటు పడటం వలన వారి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. యువత కొంతమంది కేవలం ఒకసారి రుచి చూద్దామని ప్రారంభించి దానికి బానిసలై జీవితాలను వృధా చేసుకుంటున్నారన్నారు.

కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలన్నారు. ఆ విధమైన సంస్కృతి యువతనే కాకుండా యావత్ సమాజాన్ని నాశనం చేస్తుందన్నారు. తమ విద్యాసంస్థల్లో తరచుగా ఈ విధమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల ద్వారా చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ పీ మురళీకృష్ణారెడ్డి, కొత్తపేట సీఐ టీ గణేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్స్ డీ పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనిచేస్తున్న భోజన పథకం కార్మికులను కొనసాగించాలి

విశాలాంధ్ర-నందిగామ: పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను యధాతధంగా కొనసాగించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బా రావు కి బుధవారం అర్జీవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మధ్యాహ్నం భోజనం వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సి హెచ్ సుప్రజ మాట్లాడుతూ. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గత 23 సంవత్సరాలుగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్లో విద్యార్థిని,విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారాన్ని వండిపెడుతున్నారు. వీరంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలే. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజు కూ పెరుగుతున్నాయి.మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోయినా, ప్రభుత్వం నుండి బిల్లులు సకాలంలో రాకపోయినా అప్పులు తెచ్చి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ వంట చేసి పెడుతున్నారు. అయితే నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను పని నుండి తొలగిస్తామని అక్కడక్కడ కొందరు మాట్లాడుతున్నారు. అనేక సంవత్సరాలుగా ఇబ్బందులకోర్చి పని చేస్తున్న కార్మికులను తొలగించడం సరైనది కాదని, పాత వారినే కొనసాగించాలని కోరుతున్నాము. పెరుగుతున్న ధరలకనుణంగా మెనూ రేట్లు పెంచేలా తమరు ప్రభుత్వంతో మాట్లాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సిఐటియు కార్యదర్శి కె.గోపాల్, సిఐటియు జిల్లా నాయకులు సోమేశ్వరావు, సిఐటియు నాయకులు వేల్పుల ఏసోబు,నాంగేంద్రం, సత్యవతి, లక్ష్మి, పార్వతి ,మంగ, పద్మ, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు వినియోగించొద్దు

విశాలాంధ్ర-కంచికచర్ల: దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతి రేకంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భముగా గౌరవ ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ కమిషనర్ శ్రీ పీహెచ్డీ రామకృష్ణ ఐపిఎస్ వారి ఆదేశాల ప్రకారం రూరల్ జోన్ డిసిపి శ్రీ కె.శ్రీనివాసరావు పర్య వేక్షణలో, నందిగామ ఏసీబీ డాక్టర్ బి. రవికిరణ్ అధ్వర్యములో మాదక ద్రవ్యాల వినియోగము యొక్క దుష్పరిణామాలని తెలియజేస్తూ ప్రజలకి మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పిస్తూ కంచికచర్ల గ్రామము లోని ప్రధాన రహదారి పై నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖరరావు వారి సిబ్బంది, విద్యార్థులు మరియు కంచికచర్ల గ్రామ ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నందిగామ రూరల్ సీఐ శ్రీ పి.చంద్ర శేఖరరావు, కంచికచర్ల ఎస్సై వన్ శ్రీ సుబ్రహ్మణ్యం,ఎస్సై 2 హైమవతి, చందర్లపాడు ఎస్ ఐ శ్రీ ధర్మరాజు, వీరులపాడు ఎస్సై శ్రీ మహాలక్ష్ముడు, వారి సిబ్బంది, విద్యార్థులు మరియు కంచికచర్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం నిషేధం.

డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ గా మారాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ సత్య నారాయణ ఆధ్వర్యంలో శ్రీ అక్షర డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగావిద్యార్థులతో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు సీఐ సత్యనారాయణ,ఎస్సై నాగేంద్ర కృష్ణ,శ్రీ అక్షర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, ప్రిన్సిపాల్ పాపారావు, ఉపాధ్యాయులు జోజిబాబు , కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం

విశాలాంధ్ర-తిరువూరు: జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ మరియు మానవ హారం మరియి ప్రతిజ్ఞ చేయించారు. యువత డ్రగ్స్ దూరంగా ఉండాలని బంగారు భవిష్యత్ పాడు చేసుకోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు సి ఐ అబ్దుల్ నబీ, ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా... : ఎంపీపీ గాంధీ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కలెక్టరు జి. సుజన ఉత్తర్వుల మేరకు బుధవారం "అంతర్జాతీయ మత్తు రహిత భారతదేశం" - నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మార్కపూడి గాంధీ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు, మాదక ద్రవ్యాల వినియోగంతో నిర్వీర్యమైపోతోందని, మన మందరం ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రముగా తీర్చిదిద్దటానికి కలిసి కట్టుగా కృషిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్పు చేస్తామని సిబ్బంది అందరూ ప్రతిజ్ఞ చేశారు.

డ్రగ్స్ వాడకాన్ని వ్యతిరేకించాలి

విశాలాంధ్ర-నందిగామ: మండల న్యాయ సేవాధికార సంస్థ నందిగామ వారి ఆధ్వర్యంలో నందిగామ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీ ఎక్కిరాల హనుమంతరావు అధ్యక్షతన, నందిగామ తేజ డివిఆర్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ వలి సహకారంతో ఈ రోజున అంతర్జాతీయ మాదక ద్రవ్యాల మరియు డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భం గా కళాశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ షేక్ రియాజ్ పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, న్యాయ సలహాలు సూచనలు అందించి, విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీ ఎక్కిరాల హనుమంతరావు,ఏ జి పి మట్టాప్రసాద్, శ్రీ గుర్రాల వెంకటరత్నం, శ్రీ కొమ్మినేని మౌళేశ్వరావు, శ్రీ షేక్ ఆజాద్ న్యాయ వాదులు పాల్గొని న్యాయ సలహాలు సూచనలు విద్యార్థినీ విద్యార్థులకు అందించి శుభాకాంక్షలు తెలియపరిచినారు.

స్వర సమ్మోహనం చిత్ర గీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల కళా పరిషత్ (ఒంగోలు) వారి సమర్పణలో బుధవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను సమ్మోహన పరుస్తూ సాగింది. సినీ సంగీత వారోత్సవాల చివరి రోజు కార్యక్రమాన్ని చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. గాయనీ గాయకులు తులసి(ఒంగోలు), పురాణం సుబ్రహ్మణ్యం, శేషగిరి, మస్తాన్ వలి, మువ్వ నాగేశ్వరరావు తదితరులు ప్రతి రాత్రి వసంత రాత్రి, ఆ నవ్వుల కోసమే, మనసు పాడింది సన్నాయి పాట, రావే నా చెలియా, ఫిఫ్టీ ఫిఫ్టీ నీలో సగం, ఊయలలూగే నా హృదయం, మది ఉయ్యాలలూగే వంటి రాలలోని ఆనాటి చిత్రాలలోని భాషా మధురిమను సంగీత మకరందాన్ని శ్రోతలకు పంచుతూ హృద్యంగా పాడి వినిపించారు. వీరికి కీ బోర్డుతో రవి, తబలాతో చిట్టిబాబు, వై రాజు, ప్యాడ్స్ తో రాజేష్, మువ్వలుతో రామ్మోహన్ లు రక్తిగా సహకరించారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, డోర్.నెం.40-25-43, ఫ్లాట్ నెం.9, హేమలత ఎన్‌క్లేవ్, కె.చెన్నకేశవరావు వీధి, ఎస్‌విఎస్ కళ్యాణమండపం, పటమటలంక, విజయవాడ, పిన్ నెం.520 010 నివాసి మయాంక్ దీపక్ గోర్గ్రి తండ్రి: దీపక్ ప్రేమ్‌జీ గోర్గ్రి అను నేను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.U1296520 ది. 15-06-2024 న కాళేశ్వరరావు మార్కెట్ దగ్గర బస్సు ఎక్కి బెంజిసర్కిల్ ఎన్‌టీఆర్ స్టాట్యూ దగ్గర దిగాను. ఈ ట్రావెలింగ్‌లో నా పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో లేదా ఈ క్రింది ఫోన్ నెంబర్‌కి తెలియపర్చగలరు.

9978946608

ప్రకటన

ఉస్మాన్ మొహమ్మద్, తండ్రి: మౌలానా మొహమ్మద్, 29-28/1-22, కోవెలమూడి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ, ఎన్ టి ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్. ది.25-05-2024 న గొల్లపూడి నుండి భవానిపురం కాంప్లెక్స్‌కు వస్తుండగా విజయవాడ భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నాకు చెందిన ప్రాపర్టీ లింక్ దస్తావేజులు పోయినవి. రిజిష్టర్ నంబర్ 8746/2014, సర్వే నెంబర్ 63 గా ఉన్నది. పోయిన చోట అనేక సార్లు వెతుకగా కనబడలేదు, దొరికిన యెడల కింది నంబర్‌కు కాల్ చేసి అప్పగించ ప్రార్థన.

సెల్: 98481 20786

భారతదేశంలో పదేళ్లు పూర్తి చేసుకున్న షవోమీ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో సముదాయ సంక్షేమానికి ఒక దశాబ్దం పాటు ఆవిష్కరణలను, సహకారాన్ని అందించిన సందర్భంలో, ప్రపంచ సాంకేతిక నాయకునిగా కొనసాగుతున్న షవోమీ ఇండియా, క్రికెటర్, క్యాన్సర్ నుంచి బయటపడిన యువరాజ్ సింగ్ నెలకొల్పిన లాభాపేక్షలేని సంస్థ యువరాజ్ సింగ్ ఫౌండేషన్ యు వియ్ కెన్ తో సరికొత్త భాగస్వామ్యాన్ని ప్రకటించింది. స్వస్థ్ మహిళా స్వస్థ్ భారత్ ప్రాజెక్ట్‌లో భాగంగా 15 రాష్ట్రాల్లో 12 నెలల పాటు 1.50 లక్షల మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్‌ను పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తక్కువ ప్రాతినిధ్యం, తక్కువ వనరులు ఉన్న సంఘాలపై ఈ ప్రాజెక్టు దృష్టిసారించింది. ఎక్కువ ప్రభావం, చేరికకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటే షవోమీ చేపట్టిన ఈ ప్రయత్నం భారతదేశంలో ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలలో అత్యంత ఉన్నతమైనదని షవోమీ ఇండియా అధ్యక్షుడు మురళీకృష్ణన్ బి పేర్కొన్నారు.

వీ సరికొత్త ప్లాన్ తో జీ5తో సహా 17 ఓటీటీలకు యాక్సెస్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ టెలికం ఆపరేటరు వీ, తమ కంటెంట్ అగ్రిగేటర్ యాప్, వీ మూవీస్ అండ్ టీవీని ఈ ఏడాది సరికొత్త రూపంలో ప్రవేశపెట్టింది. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ వంటి ప్రస్తుత టాప్ సంస్థలకు అదనంగా ప్రముఖ ఓటీటీ సంస్థల్లో ఒకటైన జీ5తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వీ తాజాగా ప్రకటించింది. దీనితో వీ మూవీస్ అండ్ టీవీ యాప్ ఇప్పుడు ఒకే సింగిల్ సబ్‌స్క్రిప్షన్ తో నెలకు రూ. 248తో 17 ఓటీటీ యాప్ లను అందిస్తుంది. వీ మూవీస్ అండ్ టీవీకి సింగిల్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవడం ద్వారా వీ యూజర్లు ఇకపై డిస్నీ ప్లస్ హాట్ స్టార్, సోనీ లివ్, జీ5 వంటి ప్రముఖ యాప్ లలోని తమ ఫేవరెట్ కంటెంట్ ను మొబైల్, టీవీల్లో ఆస్వాదించవచ్చు.

30న జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా ఊరు పేరు భైరవకోన

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: జీ తెలుగు ఈ నెల 30వ తేదీన మరో సూపర్ హిట్ హారర్ థ్రిల్లర్ తో మీ ముందుకు ఆసక్తికరమైన కథాంశంతో మిస్టరీ, అడ్వెంచరస్ హారర్ మూవీగా రూపొందిన ఊరు పేరు భైరవకోన ప్రదర్శన కానుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఊరు పేరు భైరవకోన' సినిమా కథ బసవ పాత్ర చుట్టూ తిరుగుతుంది బసవ (సందీప్ కిషన్) తన స్నేహితుడు జాన్ (వైవా హర్ష)తో కలిసి ఓ దొంగతనం చేస్తాడు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకుంటూ అనుకోకుండా భైరవకోన అనే ఊరిలోకి వస్తారు. భైరవకోన ఊరు ప్రత్యేకత ఏంటి , అక్కడ కనిపించే మనుషులు ఎవరు, గరుడ పురాణంలో కనపడకుండా పోయిన నాలుగు పేజీలకి భైరవకోనకి మధ్య ఉన్న సంబంధం ఏంటి, అనే విషయాలు తెలియాలంటే ఊరు పేరు భైరవకోన సినిమా చూడాల్సిందే అన్నారు. ప్రధాన నటీనటుల అద్భుతమైన నటన ఆకట్టుకునే కథాంశంతో ఫాంటసీ, డ్రామాగా ప్రేక్షకులను అలరించేందుకు 'ఊరు పేరు భైరవకోన' సిద్ధమైందన్నారు. విఐ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ, కావ్య దాపర్ ప్రధాన పాత్రలు పోషించగా, వైవా హర్ష, వెన్నెల కిషోర్, పి. రవికుకర్ ఇతర కీలకపాత్రలు పోషించారు

జర్నలిస్ట్ సాయిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం) మతసామరస్యాన్ని విఘాతం కలిగించేలా జర్నలిస్ట్ సాయి వీడియోలు. జర్నలిస్ట్ సాయి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ఫారూఖ్ షుబ్లి విజయవాడ సిపి రామకృష్ణ కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం సూర్యారావు పేటలోని పోలీస్ కమీషనర్ కార్యాలయంలో సిపి రామకృష్ణ ను కలసి కలసి ఫిర్యాదు చేశారు. ఒక మతంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తను జర్నలిస్ట్ సాయి తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రచారం చేయడం సంఘవిద్రోహక చర్య క్రిందకి వస్తుందని, ఇలాంటి తప్పుడు వార్తలు మతసామరస్యానికి భంగంకలిగిస్తాయని సంఘవిద్రోహక శక్తులకు ఊతమిస్తాయని, సోదర భావంతో మెలుగుతున్నవారి మధ్యలో పొరపచ్చలు వస్తాయని ఇలాంటి వాటిని వెంటనే నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫారూఖ్ షుబ్లి విజయవాడ కమిషనర్ ఆఫ్ పోలీస్ ను వారి కార్యాలయం నందు కలిసి సాయి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పి. హెచ్.డి రామకృష్ణ ను కోరారు.

ఏవోఐలో అపెండిక్స్ క్యాన్సర్‌కు ఆధునాతన చికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఏవోఐలో అపెండిక్ క్యాన్సర్‌కు ఆధునాతన చికిత్స అందించారు. తీవ్రమైన కడుపు నొప్పి, బొడ్డు హెర్నియా ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న 54 ఏళ్ల పురుషునికి కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏవోఐ)లో విజయవంతంగా చికిత్స చేశారు. అతను లో-గ్రేడ్ మ్యూకినస్ అపెండిషియల్ నియోప్లాజమ్ అనే అపెండిక్స్‌లో ఉద్భవించే అరుదైన క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. రోగి పొత్తికడుపు నుండి క్యాన్సర్ కణజాలాన్ని తొలగించడానికి సైటోరేడక్టివ్ సర్జరీ చేయించుకున్నాడు. దీనిలో భాగంగా పెద్దప్రేగు, పెరిటోనియం భాగాన్ని తొలగించారు. దీని తర్వాత హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీ (హెచ్ఐపీఈసీ) చేశారు. ఆ భాగంలో మిగిలిన క్యాన్సర్ కణాలను తొలగించడానికి ఉదర కుహరానికి హైపర్‌థెర్మిక్ కీమోథెరపీ చికిత్స నిర్వహించారు. ఈ సంక్లిష్ట ప్రక్రియను డాక్టర్ శ్రీకాంత్ కోటగిరి, డాక్టర్ విజయ్ కోడూరు నేతృత్వంలోని ప్రత్యేక శస్త్రచికిత్స బృందం నిర్వహించింది, డాక్టర్ మృదుల టి, డాక్టర్ ఉమాతో కూడిన అనస్థీషియా బృందం వీరికి సహకరించారు.

సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడను మర్యాదపూర్వకంగా కలిసిన రజాక్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ముఖ్య కార్య దర్శిగా నియమితులైన ముద్దాడ రవిచంద్రను ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యో గుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ సచివాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు. అబ్దుల్ రజాక్ రాష్ట్రంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యో గుల సమస్యల పరిష్కారానికి 90 రోజుల గడువుతో ప్రత్యేక కమిటీ నియమిం చాలని రవిచంద్రను కోరారు. సంఘ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపీచంద్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాత వెంకటసాయి, మణికంత పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యమే కుటుంబం క్షేమం

చల్లపల్లి ఏరియా కోఆర్డినేటర్ ఎమ్.మధు
ఆహారము-పోషణ-ఆరోగ్యం - పారిశుద్ధ్యంపై వీఓఏలకు ముగిసిన శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-ఘంటసాల : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం క్షేమంగా ఉంటుందని చల్లపల్లి ఏరియా కోఆర్డినేటర్ ఎమ్.మధు అన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఘంటసాల మండల ఏపీఎం బి.అమరేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాల వెలుగు కార్యాలయంలో విజయశ్రీ మండల మహిళా సమైఖ్యలో పని చేస్తున్న 42 మంది వీఓఏలకు ఆహారము - పోషణ - ఆరోగ్యం - పారిశుద్ధ్యం పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీ మధు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. నేటి సమాజంలో అన్ని ఆహార పదార్థాలు కల్తీతో పాటు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడటంతో అనారోగ్యాలు పాలవుతున్నారన్నారు.

గతంలో ఒక మనిషి సగటున వందేళ్లు బ్రతికేవారని, నేడు చిన్న వయస్సులోనే అనారోగ్యాలతో పాటు గుండెపోటు, ఇతర ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారన్నారు. దీంతో మహిళల్లో చైతన్యం కల్పించేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆహారము - పోషణ - ఆరోగ్యం - పారిశుద్ధ్యం పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క వీఓఏలు ఆహార పోషణ కోసం వారి ఇళ్ల వద్ద పెరటి తోటలు పెంచుకుని పశువుల పేడ, ఇతర సేంద్రీయ ఎరువులతో పండించుకోవాలని తద్వారా కుటుంబానికి ఆహారంతో పాటు అమ్మడం ద్వారా ఆదాయం వస్తుందని సూచించారు. ప్రతి మహిళా తమ సమీపంలోని పీహెచ్సీల్లో డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బందితో నెలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్త హీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే సకాలంలో వైద్య సేవలు పొందాలన్నారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర వైద్య సేవల గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత లేని మహిళా సమాజం కోసం పాటుపడాలన్నారు. ఈ విషయాలను మీ డ్వాక్రా గ్రూపు ప్రెసిడెంట్లకు, సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం నుంచి డ్వాక్రా సంఘాల ప్రెసిడెంట్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందరూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యంగా జీవించాలని ఏరియా కోఆర్డినేటర్ మధు ఆకాంక్షించారు. మూడురోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లుగా మోపిదేవి, కంకిపాడు, బంటుమిల్లు మండలాల ఏపీఎంలు ఎస్.శ్రీనివాసరావు. ఎన్.సాంబశివరావు, డి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎల్సీ రత్నం, సీసీలు ఎమ్.ఝాన్సీ, జి.నాగేశ్వరమ్మ, ఎకౌంటెండెంట్ ఓ.జానకి, సీవో ఎమ్.చిత్ర, వీఓఏలు పాల్గొన్నారు.

బి ఏఐ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి సెంటర్ ఆధ్వర్యంలో ఒక హెటల్లో జరిగిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షునిగా టీ పానకాలరావు (గోపి)అధ్యక్షతన వహించగా కార్యక్రమం ముందుగా ప్రముఖ వ్యాపారవేత్త ఎంతోమంది ఉన్నత శిఖరాలకు తీర్చికెళ్ళినటువంటి రామోజీరావు పరమపదించడం వల్ల వారికి ముందుగా సంతాప తీర్మానం ప్రకటించగా సంతాపం తెలియజేసి వారి గురించి బిల్డర్సేషన్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా లీడర్ రామకోటయ్య రామోజీ గురించి గొప్పతనాన్ని తెలియజేశారు. ఎంతో మందికి ఆదర్శపురుషులని వారు చనిపోయినను వారి యొక్క జ్ఞాపకాలు ప్రజలు గుండెల్లో ఉంటాయని వారి క్రమశిక్షణకు మారుపేరని ఎంతోమంది కార్మికులను ఉద్యోగాలు ఇచ్చిన గొప్ప ఘనత వారికే దక్కుతుందని తెలియజేశారు. అనంతరం అసోసియేషన్లో సమస్యల గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ప్రయత్నం చేయాలని చెప్పి సభ్యులు కోరగా దాని గురించి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేద్దామని పెద్దలు బి ఏ ఐ ఏపీ చైర్మన్ అత్తులూరి నాగమల్లేశ్వరరావు తెలియజేశారు. స్కూల్స్ సైన్స్ ట్రైనింగ్ అధికారి రమేష్ లీకేజెస్ సంబంధించి బిల్డింగుల్లో జరుగుతున్న లీకల గురించి వాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చాలా చక్కగా వివరించడం జరిగింది వారితో పాటు వారు స్టాఫ్ కూడా ఎల్సిడి ప్రొజెక్టర్ ద్వారా బిల్డర్లకు జాగ్రత్త ఎలా తీసుకోవాలన్న దాని గురించి చాలా చక్కగా వివరించారు అనంతరం వారికి అసోసియేషన్ నాయకులు గౌరవంగా సత్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా సహకరించిన అజయ్ పైప్స్ వారికి కూడా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అసోసియేషన్ కార్యదర్శి ట్రెజరర్ బలివాడ శివకుమార్ పట్నాయక్ ప్రభు శశాంక్ జి పూర్ణచంద్రరావు వంశీ రాజా రాఘవరావు బండి పవన్ చాలామంది మెంబర్స్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం

విశాలాంధ్ర-విజయవాడ: మాదక ద్రవ్యాల తీసుకోవటం ద్వారా ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని యువత వాటికి దూరంగా ఉండాలని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని మండల ప్రజాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ యూసేఫ్ అన్నారు. నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్ వాడకం అనేది సరదాగా ప్రారంభమై తరువాత అలవాటుగా మారుతుందన్నారు. దీంతో శరీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించాలని పోస్టర్ విడుదల చేశారు. నవజీవన్ బాలభవన్ కార్యకర్తలు జ్యోతి, సుజాత, పద్మతులసి విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగించే సంభవించే దుష్పలితాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసైన వారికి కౌన్సింగ్ ఇవ్వటం, చికిత్స అందించటం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మీని శుభాకాంక్షలు తెలిపిన ఏపీ జీఈఏ నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) గుంటూరు జిల్లా నాయకులు నూతనంగా విధుల్లో చేరిన కలెక్టర్ నాగలక్ష్మీని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పుష్ప గుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 2024 సాధారణ ఎన్నికల్లో పని చేసిన ఉద్యోగులకు రెమ్యూమరేషన్ చెల్లించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లందరికీ నగదు రహిత వైద్యం అంద జేసే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియ జేసిన వారిలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీములా షాఖా దరి, జిల్లా కోశాధికారి పోతురాజు, కార్యదర్శి పెదరత్తయ్య, ప్రధాన కార్యదర్శి సుమిత్రదేవి, సహ అధ్యక్షురాలు హేమలత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థ వంతంగా అమలు చేస్తూ ప్రజాప్రతి నిధులు, అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో నడిపించేం దుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. బుధవారం కలెక్ట రేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నూతన జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగ లక్ష్మీ అధికార బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీకి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబ ర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. వేద పండింతులు, కుటుంబసభ్యులు ఆశీర్వా దాలు అందించారు. కలెక్టర్ నాగలక్ష్మీ మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా పనిచేసేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంకు, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. గతంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేసిన జిల్లాకు మరల కలెక్టర్‌గా రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీకి జిల్లా ఎస్పీ తుషార్ డూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారి పెద్దిరోజా, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి శ్యాంపిల్స్ సేకరించాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో త్రాగునీటి సరఫరా జరిగే సమయాల్లో శ్యాంపిల్స్ విరివిగా తీయాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాని గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికా రులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి త్రాగునీటి సరఫరా, డ్రైన్లలో ఉన్న పైప్ లైన్ల షిఫ్టింగ్‌పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయం వారిగా ప్రతి ఎమినిటి కార్యదర్శి తప్పనిసరిగా త్రాగునీటి సరఫరా సమయంలో శ్యాంపిల్స్ సేకరించా లని ఆదేశించారు. ఏఈలు తమ పరిధిలోని వాటర్ శ్యాంపిల్స్‌లో ఎక్కడైనా ఫిర్యాదు వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి కాలుష్యంపై అందే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశా లలో నగర ప్రజలు కొందరు డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్నారని, గుంటూరు నగరంలో గతంలో జరిగిన డయేరియా ఘటనలను దృష్టిలో ఉంచుకొని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైన్లు ఎక్కడైనా స్టాగ్నే షన్ అయితే వెంటనే కచ్చా డ్రైన్‌లు ఏర్పాటు చేసి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ శ్యాంసుందర్, సీఎంఓ హెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్, కోటేశ్వరరావు, కొండా రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలయ్య, గిరిబాబు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో హాల్‌లో ఈ నెల 27వ తేది ఉదయం 10 గంటలకు జరుగనున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డే బాలయ్య, గిరిబాబు పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్య రంగంపై నూతన ప్రభుత్వం దృష్టి సారించి ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్య రంగంలో ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో 11వ పీఆర్సీలో 23 శాతం ఇచ్చారని, సీపీఎస్ రద్దు హామీ అమలు చేయలేదని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం వేతనం అమలు జరుపలేదని చెప్పారు. సరెండర్ లీవ్ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. శానిటేషన్ వర్కర్లకు ఇస్తామన్న వేతనం రూ.16 వేలకు బదులు రూ.10 వేలు ఇస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని వెల్లడించారు. ఈ సభలకు ముఖ్యఅతిధులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, గౌర వాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి హాజరుకానున్నట్లు వివరించారు. వక్తలుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఏఐటీ యూసీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం యూనియన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఉంటుందని చెప్పారు.

గేదెల దొంగతనాలపై నలుగురి అరెస్ట్

విశాలాంధ్ర-మేడికొండూరు: మేడికొండూరు మం డల పరిధిలో అనేక గ్రామాలలో ఇటీవల కాలంలో గేదెల వరుస దొంగతనాలతో రైతుల బెంబేలు చెంది స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు కలిసికట్టుగా ఏర్పడి అర్ధరాత్రి ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి గేదెల దొంగను పట్టుకొని మేడి కొండూరు పోలీసులకు అప్పగించారు. మేడికొం డూరు సీఐ జయకుమార్ ఆదేశాలతో ఎస్సై వాసు గేదెల దొంగను తమదైన శైలిలో విచారించిన పోలీసులు మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టి ప్రధాన ముద్దాయికి సహకరించిన నలుగురు దొంగల ను అరెస్ట్ చేశారు. ఆ మధ్యవర్తి తనకు తెలిసిన సమీప గ్రామాల రైతులకు ఈ గేదెలను అమ్మినట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు. బుధవారం గేదెల మధ్యవర్తి దగ్గర కొన్న రైతుల వద్ద నుండి సుమారు 8 గేదెలను మేడికొండూరు పోలీసులు రికవరీ చేసి బాధిత రైతులకు అప్పజెప్పారు. దీనితో బాధిత రైతులు ఆనందం వ్యక్తం చేశారు.